ఏసీఏ అండర్-23 జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు షురూ

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-23 మల్టీడేస్ అంతర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు శనివారం ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా పోటీలు ప్రారంభించారు. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 66.3 ఓవర్లలో 374 పరుగుల వద్ద సెంట్రల్‌జోన్ జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని ఎం. వంశీకృష్ణ 105 బంతుల్లో 6 సిక్సర్లు, 16 ఫోర్లతో 120 పరుగులు చేశాడు. ఈయనకు జతగా వసంతవర్ధన్ 69 పరుగులు, దుర్గా బాలాజీ 66 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు ఎస్. ఆదిల్ హుస్సేన్ 5 వికెట్లు, అఖిల్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 82 పరుగులు చేసింది. జట్టులోని టి.వంశీకృష్ణ 35 పరుగులు, యోగానంద 30 పరుగులతో క్రీజులో ఉన్నారు.



కేఓఆర్ఎం మైదానంలో తలపడుతున్న రెస్ట్ ఆఫ్ జోన్, నార్త్‌జోన్ జట్లు

ఆధిక్యంలో నార్త్‌జోన్ జట్టు..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ జోన్, నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన రెస్ట్ జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 46 ఓవర్లలో 134 పరుగుల వద్ద రెస్ట్ ఆఫ్ జోన్ జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని ఎం.కె. దత్తారెడ్డి 60 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు శ్రీకర్ సాయిరెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 30 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. జట్టులోని రవికిరణ్ 54 పరుగులతో క్రీజులో ఉన్నాడు. రెస్ట్ ఆఫ్ జోన్ బౌలర్లు ఎం. చెన్నారెడ్డి 3 వికెట్లు తీశాడు. కాగా తొలిరోజు మ్యాచ్ పూర్తయ్యే సమయానికి నార్త్‌జోన్ జట్టు 28 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.



120 పరుగులు చేసిన ఎం. వంశీకృష్ణ



5 వికెట్లు తీసిన సౌత్ జోన్ బౌలర్ ఆదిల్

క్లుప్తంగా

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన రాజేశ్వరి

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఉరివేసుకొని రాజేశ్వరి (22) అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు రాజేశ్వరికి ఆరునెలల క్రితం సుదర్శన్ అనే వ్యక్తితో వివాహమైంది. కొన్ని వివాదాల కారణంగా ఇటీవల వారిద్దరూ విడాకులు తీసుకున్నారు. దీంతో ఆమె పుట్టినిల్లు గాదెల వెంకటాపురంలో ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. శనివారం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

కీచకోపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

మదనపల్లె : పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించి, వేధింపులకు పాల్పడిన ఫిజికల్ డైరెక్టర్(పీడీ) గోపీనాథ్‌పై బాధిత విద్యార్థిని తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదుచేసినట్లు టూటౌన్ ఇన్‌చార్జి సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జెడ్పీహైస్కూల్ పీడీ గోపీనాథ్ కీచకపర్వంపై పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు...ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో మహిళా ఎస్ఐ రమాదేవి పాఠశాలలోని విద్యార్థినులను విచారించారన్నారు. విచారణలో విద్యార్థినులు తెలిపిన వివరాల మేరకు పీడీపై విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపామన్నారు. అలాగే బాధిత విద్యార్థిని తల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి గోపీనాథ్ లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు.

సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్

సిద్దవటం : లంకమల అభయారణ్యంలోని సిద్దవటం-బద్వేల్ రేంజ్ సరిహద్దులోని సమస్యాత్మక ప్రదేశాల్లో శనివారం అటవీ అధికార సిబ్బందితో కూంబింగ్ నిర్వహించామని ట్రైనీ ఐఎఫ్ఎస్ శుభం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమాలకు పాల్పడకుండా తమిళ స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అటవీ ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే ప్రజలు వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సిద్దవటం-బద్వేల్ రేంజిల్లోని సరిహద్దుల్లో అణువణువు గాలించామన్నారు. ఎక్కడా కూడా స్మగ్లర్ల ఆనవాళ్లు కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రేంజర్ కళావతి, డీఆర్ఓ కె. ఓబులేసు, బద్వేల్ డీఆర్ఓ వెంకటశేషయ్య, రోళ్ల బోడు బీటు అధికారి విశ్వనాథ్, కొత్తచెరువు బీటు అధికారి రాజేష్‌రెడ్డి, బద్వేల్ బీటు అధికారి సువర్ణ కుమార్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.



లంకమల అభయారణ్యంలో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

భారీగా తగ్గిన చికెన్ ధరలు

కిలోపై ఏకంగా రూ.80 తగ్గుదల

కార్తీక మాసానికి ముందు చికెన్ ధరలు ఇలా.. ఇప్పుడు ఇలా

లైవ్ కోడి	140	100
డ్రెస్స్‌డ్	220	140
స్కిన్‌లెస్	250	160
బోన్‌లెస్	400	280



రాజంపేట టౌన్ : గత కొంతకాలంగా పెరుగుతూ వచ్చిన చికెన్ ధరలు ప్రస్తుతం అమాంతంగా పడిపోయాయి. కిలో చికెన్ మీద ఏకంగా ఎనభై రూపాయలు తగ్గింది. నాలుగు రోజుల క్రితం వరకు కిలో చికెన్ (డ్రెస్‌డ్) 220 రూపాయలు ఉండగా ప్రస్తుతం 140 రూపాయలకు పడిపోయింది. పట్టణంలో దాదాపు యాభైకి పైగా చికెన్ విక్రయాల దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలన్నింటిలో సాధారణ రోజుల్లో రోజుకు మూడువేల కిలోల వరకు, ఆదివారం రోజు ఐదువేల కిలోలకు పైగా చికెన్ విక్రయాలు సాగుతుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడం, దీనికి తోడు అయ్యప్ప భక్తులు మాలలు వేయడంతో చికెన్ విక్రయాలు దారుణంగా పడిపోవడానికి ప్రధాన కారణమని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం రోజుకు వెయ్యి నుంచి పన్నెండు వందల కిలోలు మాత్రమే చికెన్ విక్రయాలు సాగుతున్నాయి. కార్తీక మాసం ప్రారంభం అయ్యాక ఈనెల 19న వచ్చిన ఆదివారం కేవలం రెండువేల ఐదువందల కిలోల లోపే విక్రయాలు సాగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం చికెన్ ధరలు బాగా తగ్గినప్పటికి కొనుగోలు మాత్రం పెరగకపోవడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం శీతాకాలం అయినందున తక్కువ రోజులకే కోడి ఉత్పత్తి అవుతుంది. ఒకవైపు కోళ్ల పరిశ్రమల్లో ఉత్పత్తి గణనీయంగా పెరగడం, మరోవైపు విక్రయాలు దారుణంగా పడిపోవడంతో వ్యాపారులతో పాటు కోళ్లపరిశ్రమ యాజమాన్యాలపై కూడా తీవ్ర ప్రభావం చూపనుంది.

ఆలయంలో చోరీ

– వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న జనం



చోరీకి గురైన ఆంజనేయస్వామి ఆలయం ఇదే

నందలూరు (రాజంపేట) : నందలూరులో గత రెండు నెలలుగా వరుస చోరీలతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇటీవలి కాలంలో ఒకేరోజు నాలుగు ఆలయాలలో చోరీ జరిగింది. మరలా రెండు రోజుల తరువాత మరో ఆలయంలో చోరీ జరిగింది. అది మరువకముందే ఓ కిరాణా దుకాణంలో, మరో మూడు రోజులకు ఓ రెండు కూల్ డ్రింక్స్ షాపులలో చోరీ జరిగింది. ఇంతలోనే శుక్రవారం రాత్రి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ గొల్లపల్లికి వెళ్లే రహదారిలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆంజనేయస్వామి పంచలోహాల తొడుగు, సీసీ కెమెరాను దొంగలు ఎత్తుకెళ్లారు. దొంగలు ఖరీదైన వస్తువులను, నగదును దోచుకెళ్తున్నారు. కిరాణా షాపులలో ఖరీదైన సిగరెట్లు, నగదు తీసుకెళ్లారు. ఆలయాలలో ఖరీదైన వస్తువులు, హుండీలోని డబ్బులను దోచుకెళ్తున్నారు. చోరీల మీద చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాలుగా మారారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ అబ్దుల్ జహీర్ పరిశీలించారు. రాత్రి వేళల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బంగారం చోరీ

చిట్వేలి : మండల పరిధిలోని వెంకటరాజుపల్లి ఎస్సీ కాలనీలో చలమాల నారాయణమ్మ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపిన వివరాల మేరకు చలమాల నారాయణమ్మ శుక్రవారం ఊరిలో లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని రూ. 80 వేలు విలువచేసే మూడు తులాల బంగారాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యూపీఎస్సీలో ఆల్ ఇండియా 31వ ర్యాంకు



అనిల్‌కుమార్‌రెడ్డి

రామాపురం : ఇటీవల వెలువడిన యూపీఎస్సీ ఇంజినీరింగ్ సర్వీస్ పరీక్షా ఫలితాల్లో మేరువ అనిల్ కుమార్‌రెడ్డి ఆల్ ఇండియా 31వ ర్యాంకు సాధించాడు. మండలంలోని చిట్లూరు గ్రామం రాఘవరెడ్డిగారిపల్లికు చెందిన అయోధ్యపురం వెంకటరామిరెడ్డి మనవడు మేరువ అనిల్‌కుమార్‌రెడ్డి వరంగల్ ఎన్ఐటీ కళాశాలలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఐఐఎస్‌సీ బెంగళూరు కళాశాలలో ఎంటెక్ పూర్తయింది. అనంతరం యూపీఎస్సీ నిర్వహించిన ఈఎస్ఈ 2023 పరీక్షల్లో ఆల్‌ఇండియా 31వ ర్యాంకు సాధించాడు. తండ్రి వెంకటరెడ్డి రిటైర్డ్ బ్యాంకు మేనేజర్, తల్లి నిర్మల గృహిణి, అన్న సునీల్‌కుమార్ రెడ్డి సివిల్స్‌లో ర్యాంకు సాధించి ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్టుమెంట్‌లో డిప్యూటి కమిషనర్‌గా బెంగళూరులో పని చేస్తున్నారు.

నవశకం



సొంత ఇల్లు నిర్మించుకుంటున్నా



మాది నిరుపేద కుటుంబం. 13 ఏళ్ల క్రితం భర్త మృతి చెందడంతో కూలీ నాలీ చేసుకుంటూ పూరి గుడిసెలో జీవనం సాగిస్తున్నా. గతంలో ఇంటి కోసం అర్జీలు పెట్టుకున్నా ఎవరూ కనికరించలేదు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఇల్లు మంజూరు చేశారు. దీంతో ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటున్నా.

– శేషమ్మ, రెడ్డివారిపల్లె, మహల్‌రాజుపల్లె పంచాయతీ, కేవీపల్లె మండలం.

ఉపాధ్యాయులపై పెరిగిన గౌరవం



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నాడు–నేడులో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఈ కారణంగా ఉపాధ్యాయులు అంటే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు గౌరవ మర్యాదలు పెరుగుతున్నాయి. పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. జగనన్న ప్రభుత్వం రాక ముందు పేద మధ్య తరగతి వర్గాల వారు సైతం వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించుకునేవారు. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక మంచి భోజనం, దుస్తులు, పుస్తకాలు, విశాలమైన గదులు, ఫర్నీచర్ అందుబాటులోకి వచ్చాయి.

– ఎస్.మజహరుల్‌హక్, స్కూల్ అసిస్టెంట్, నీలకంఠ్రావుపేట, రామాపురం మండలం

ఆరోగ్యశ్రీ కార్డు పొందాను



గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ కార్డు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాము. ఈ ప్రభుత్వంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కార్డు పొందాను. నేను గత కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాను. ఈ కార్డు ద్వారా నాకున్న వ్యాధికి చికిత్స పొందుతున్నాను.

– కెంచా నారాయణమ్మ, రామాపురం, రామాపురం మండలం

పేదల జీవితాలలో వెలుగులు నింపడమే లక్ష్యం

– భూమిలేని నిరుపేదలకు భూ హక్కును కల్పించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
– సంబేపల్లె , గాలివీడు మండలాల్లో పేదల భూ పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లె: పేదల జీవితాలలో వెలుగులు నింపాలన్నదే సీఎం జగన్ ధ్యేయమని వైఎస్సార్ సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నార. శనివారం సంబేపల్లె మండలం, నారాయణరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయ భవన సముదాయంలో జరిగిన సంబేపల్లె మండలంలోని అసైన్మెంట్ భూములు, ఇనాం భూములు 2003 మంది డీకేటీ భూముల పట్టాల పంపిణీలో డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్దన్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ దేనాథ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్ రెడ్డి, సర్పంచ్ అలివేలమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథ రామిరెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్ రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, సింగల్ విండో డైరెక్టర్ వెంకట రామిరెడ్డి నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ హక్కు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేస్తోందన్నారు. సంబేపల్లె మండలంలో కొత్త డీకేటీ భూముల పట్టాలు పొందుతున్న లబ్దిదారులు 277 మందికి 170.91 ఎకరాలు, ఇనాం భూముల పట్టాలు 534 మందికి 492.92 ఎకరాలు, 2023కి ముందు డీకేటీ భూములు పట్టాలు 5902 మందికి 7315.3 ఎకరాల భూములు మొత్తం కలిపి 6713 మంది లబ్దిదారులకు 7979.13 ఎకరాల భూములను పట్టాలుగా ఇస్తున్నామని వెల్లడించారు పట్టణ పేదలకోసం నిర్మిస్తున్న నారాయణరెడ్డిపల్లె లే అవుట్ నిర్మాణానికి సహకరించిన రైతులకు శ్రీకాంత్ రెడ్డి పాదాభివందనాలు తెలిపారు. భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు 20 సెంట్లు చొప్పున 150 మంది రైతులకు కలెక్టర్ కృషితో పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్రహ్మాండమైన లే అవుట్ నిర్మితమవుతోందన్నారు.



సంబేపల్లె: లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

భూ సమస్యల పరిష్కారానికి జీఓ విడుదల....

సంబేపల్లె మండలంలోని ప్రకాశ్ నగర్ కాలనీ దళితులకు జెడ్ఎస్ డీసీ భూములను 157 మందికి, చిన్నమండెం మండలంలోని దిగువ గొట్టివీడు భూ సమస్యల పరిష్కారానికి జీఓలు విడుదలయ్యాయన్నారు. రమేష్ రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలు, నాయకులు వసంత, శ్రీనివాసులు రెడ్డి, నాగరాజు యాదవ్, ఎంపీటీసీ రాజుకుమారి, మసల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ పంపిణీతో శాశ్వత ప్రయోజనం

గాలివీడు: ఏళ్ల తరబడి నుంచి భూమి సాగు చేసుకుని హక్కులు లేని రైతులకు, భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీతో శాశ్వత ప్రయోజనం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలో జరిగిన అసైన్మెంట్ భూములు, ఇనామ్ భూముల పట్టాల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మండలంలో తొలివిడతగా అసైన్మెంట్ కమిటీకి సంబంధించి 118 పట్టాదారులకు 141.36 ఎకరాలు విస్తీర్ణపు భూములకు పట్టాలు అందచేసి, వాటికి సమగ్రమైన రికార్డులతో అందిస్తున్నారన్నారు. ఇనాం భూములకు సంబంధించి 604 మంది పట్టాదారులకు 547.15 ఎకరాలు విస్తీర్ణాన్ని రైతులకు పట్టాలుగా ఇవ్వడం జరుగుతోందన్నారు. త్వరలో అసైన్మెంట్ రెగ్యులరైజర్ చట్టం ద్వారా 4,753మంది రైతులకు 7,982 ఎకరాలు విస్తీర్ణాన్ని పట్టాలుగా అందచేయడం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రతి చెరువును సాగునీరుతో నింపుతామన్నారు. దళిత వాడలో స్మశాన వాటికలను స్థలాలను కూడా జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మండల కన్వీనర్ మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ గాలి శ్రీనివాసులు , మండల జేసీఎస్ కన్వీనర్లు ఖాదర్‌మొహిద్దీన్(ఎస్‌కే), నల్లాబత్తుని వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గుమ్మా అమరనాథ్‌రెడ్డిడ, సర్పంచ్లు ఉమాపతి రెడ్డి, ఉమా ప్రభాకర్, జానకి రామాంజులురెడ్డి, కామసాని కేశవ రెడ్డి, బాబాపకృద్దీన్, దేరంగుల నారాయణ, క్రిష్టా రెడ్డి, మల్లికార్జుననాయుడు, ఎంపీటీసీలు, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ వల్లేపు నగేష్, తదితరులు పాల్గొన్నారు.



గాలివీడు: పేదలకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

మెగా జాబ్‌మేళాను విజయవంతం చేద్దాం

రాయచోటి అర్బన్: డిసెంబర్ 2వ తేదిన ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగాజాబ్‌మేళాను విజయవంతం చేద్దామని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాష, కమిషనర్ గంగాప్రసాద్ కోరారు. శనివారం పట్టణంలోని ఫయాజ్ ఫంక్షన్‌హాల్‌లో సచివాలయం కార్యదర్శులు, వలంటీర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం అధికారులతో సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 2 సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో జాబ్‌మేళాను జరుపనున్నామన్నారు. జాబ్‌మేళాలో దాదాపు 120 బహుళజాతి కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మల్లికార్జున, స్కిల్‌డెవలప్‌మెంటు విభాగం ఇన్‌చార్జ్‌లు హరిక్రిష్ణ,ఆరీఫ్ పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలి

సంబేపల్లె: రాయచోటి నియోజకవర్గంలో పక్కా గృహాల నిర్మామాలకు నాలుగున్నరేళ్ల పాలన కాలంలో రూ. 186 కోట్లు నిధులను ప్రభుత్వం వెచ్చించిందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం సంబేపల్లె మండలం, నారాయణరెడ్డిగారిపల్లె సచివాలయంలో హౌసింగ్ అధికారులతో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్దన్ రెడ్డి, ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మీ, చిదంబర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ అధికారులను శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు.లబ్దిదారులకు బిల్లులు పెట్టడానికి జియోట్యాగ్ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇంటి నిర్మాణం చేసి బిల్లులు పడని లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా వెంటనే ప్రత్యేక చొరవతీసుకొని బిల్లులు పడేలా చూడాలని పీడీని ఆదేశించారు.

ఓటును సద్వినియోగం చేసుకుందాం

రాయచోటి : రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మునియా నాయక్ పిలుపునిచ్చారు. ఓటు నమోదు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ 1,2 యూనిట్స్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు నమోదు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లు డిసెంబర్ 9వ తేది వరకు ఉంటుందని విద్యార్థులకు తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె గురప్ప, యు ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య కార్డుల పంపిణీ

చిట్వేలి: పశువులకు వచ్చే వ్యాధులను నిర్ధారించేందుకు పశు హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు రాజంపేట డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. చెర్లోపల్లిలో గోపాలమిత్ర శివప్రసాద్, మిత్రుడు గంగయ్యల సహాయ సహకారంతో స్థానిక సర్పంచ్ ఈశ్వరయ్య అధ్యక్షతన శనివారం హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ రెండు, మూడు నెలలకు ఒకసారి వైద్య శిబిరాలు నిర్వహించాలని చిట్వేలి పశువైద్యులను ఏడీకేడీ వరప్రసాద్‌ను ఆదేశించారు. 62 మందికి పశుహెల్త్ కార్డులను పంపిణీ చేశారు.

చక్కటి ప్రణాళికతో భవిష్యత్తు

రాయచోటి అర్బన్: విద్యార్థులు చక్కటి ప్రణాళికను రూపొందించుకుని కృషి,పట్టుదల, అంకితభావంతో విద్యనభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చునని ఎస్పీ బి.కృష్ణారావు అన్నా రు.శనివారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకుని ఉన్నతోద్యోగాలను అందిపుచ్చుకోవాలన్నారు. వీరబల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘు, పీఆర్‌టియు రాష్ట్రనేత శ్రీనివాసరాజు ప్రసంగించారు. విద్యార్థినులకు జ్ఞాపికలు అందచేశారు.

రేపటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు

పెనగలూరు: ఈనెల 27వ తేది నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలకు గ్రామాలలో ఎంపిక ప్రక్రియ చేపట్టాలని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సచివాలయాల వారీగా ఆడుదాం ఆంధ్రా ఆటలు పోటీలలో విద్యార్థిస్థాయి నుంచి పెద్దవారిని కూడా ఎంపిక ప్రక్రియ చేపట్టాలన్నారు. 15 నుంచి 50 సంవత్సరాల వయస్సుగల ఆసక్తిగల అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఎంఈఓ నాయుడు, ఏఓ పద్మభూషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

న్యాయమూర్తులు కృష్ణన్‌కుట్టి, మహ్మద్ ఇస్రాత్ ఫాతిమా

రాయచోటిటౌన్ : డిశంబర్ 9న నిర్వహించే జాతీయ లోక అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్‌కుట్టి, మరో న్యాయమూర్తి, మహమ్మద్ ఇస్రాత్ ఫాతిమా పోలీసులకు సూచించారు. లోక అదాలత్ ద్వారా వచ్చే తీర్పు సుప్రీం కోర్టులో వెలువడే తీర్పుతో సమానం అనే విషయాన్ని కక్షిదారులకు తెలియచేయాలన్నారు. ఈ లోక అదాలత్ అన్ని రకాల కేసులకు సంబంధించిన వాటిపై తీర్పులు ఉంటాయని చెప్పారు. దీనికి రాయచోటి కోర్టు డివిజన్ పరిధిలోని అన్ని మండల పోలీస్ అధికారులు పరిశీలించి ప్రజలకు వివరించి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్, రూరల్ సీఐలతో పాటు రూరల్‌పరిధిలోని ఎస్‌ఐలు, ట్రాఫిక్ ఎస్ఐ, ఇతరా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సాయం

న్యాయవాదులను పెట్టుకొని వాదించుకునే స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని రాయచోటి జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి మహమ్మద్ ఇస్రాత్ ఫాతిమా అన్నారు. శనివారం రాయచోటి సబ్ జైల్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా జైల్లో ఉన్న నిందితులను వారి అవసతులు, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. జైలు జీవితంలో సత్ప్రవర్తన కలిగిన వారికి బెయిల్ మంజూరు చేస్తామని చెప్పారు. చేసిన పొరపాట్ల నుంచి గుణపాఠాలు నేర్చుకొని మంచి జీవితం సాగించేందుకు పాటు పడాలని కోరారు. జైలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత

రాయచోటి అర్బన్ : పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేసే అంశానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్‌బాషా అన్నారు. పట్టణంలో రవి థియేటర్ వద్ద పాతమున్సిపల్ కార్యాలయం స్థలంలో నూతన ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి ఆయన కౌన్సిలర్లతో కలసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3.5 కోట్ల తో 15లక్షల లీటర్ల నిల్వసామర్థ్యంతో నూతన ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ట్యాంకు నిర్మాణంతోపట్టణంలోని కొత్తపల్లె, వేతల్‌కాలనీ, అలీమాబాద్, ట్రంకు రోడ్డు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరందించవచ్చు అన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్లు గౌస్‌ఖాన్, కొలిమి చాన్‌బాష, కొలిమి హారూన్, రౌనఖ్ హుస్సేన్, వైఎస్ఆర్‌సిపి నేతలు ఫయాజ్‌అహమ్మద్, షబ్బీర్, వైఎస్ఆర్ సిపి నేతలు సుగవాసి శ్యామ్‌కుమార్, రియాజుర్ రహిమాన్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్



సేవకు మారుపేరు కొండూరు

రాజంపేట: రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 12 ఏళ్ల ఏకగ్రీవంగా ఎన్నికవుతూ, అటు బెంచ్, బార్‌కు మధ్య సత్సంబంధాలు మెరుగుపరిచిన న్యాయవాది కొండూరు శరత్‌కుమార్‌రాజు (కెఎస్సార్). తల్లిదండ్రులు కొండూరు రామరాజు, గుర్రమ్మ. శరత్ నెల్లూరు వీఆర్ లా కాలేజి 1987 నుంచి 1990 వరకు న్యాయవిద్యను కొనసాగించి, కాలేజి ఎన్నికల్లో చైర్మన్‌గా గెలిచి విద్యార్థి దశలోనే తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. 1991లో బార్ అసోసియేషన్‌లో ఎన్‌రోల్‌మెంట్ అయ్యారు. ఆ నాటి నుంచి రాజంపేటలో తండ్రి బాటలో పేదవారికి న్యాయం అందించేందుకు కృషిచేస్తూ వచ్చారు. ఆ విధంగా రాజంపేట న్యాయవాదుల్లో తనకంటూ ఒక ప్రత్యేకను చాటుకున్నారు. అంతేగాకుండా బార్ అసోసియేషన్ అధ్యక్షుని హోదాలో కోర్టు కాంపెక్స్ భవనాల స్థలం విషయంలో హైకోర్టు, జిల్లా జడ్జిలను కలిసి, వారిని ఇక్కడికి రప్పించి, కోర్టు భవనాలు, కక్షిదారులు మెరుగైన సేవలు, న్యాయ వాదుల సంక్షేమం లాంటి వాటివి అమలు చేసేందుకు తన వంతుగా కృషిచేశారు.



అన్నమయ్య డ్యాం వరదబాధితులకు నిత్యావసర సరుకులను అందచేస్తున్న కొండూరు శరత్‌కుమార్‌రాజు (ఫైల్)

సామాజిక సేవలో కెఎస్సార్...

న్యాయవాదిగా సేవలందించడమే కాకుండా, తన సేవా పరిధిని సమాజంలో కూడా విస్తరింపజేశారు. అన్నమయ్య డ్యాం వరదబాధితులకు లయన్స్‌క్లబ్ నేతృత్వంలో రూ.40లక్షల వ్యయంతో నిత్యావసరంగా అవసరమైన కిట్స్‌ను 600 మందికి పంపిణీ చేశారు. కరోనా మహమ్మారి (2019)తొలినాళ్లలో వాకర్స్ ఇంటర్‌నేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 302 డిస్ట్రిక్ గవర్నర్ హోదాలో రాజంపేట టౌన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో రూ.10లక్షల వ్యయంతో నిత్యావసర సరుకులను అందచేశారు. రాజంపేట ప్రభుత్వ క్రీడామైదానంలో వాకర్స్ కోసం మెరుగైన వాకింగ్ ట్రాక్ తోపాటు, వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. అన్నమయ్య 108 అడుగుల విగ్రహం సమీపంలో శాన్వి ఇంటర్‌నేషనల్ స్కూల్(సీబీఎస్)ను ఏర్పాటుచేసి ఎందరో పేద విద్యార్థులకు ఉచితవిద్యతను అందించారు. రాజంపేటలో బీవీఎన్ విద్యాసంస్థను తండ్రి రామరాజు నేతృత్వంలో ఏర్పాటుచేశారు.

ప్రజా సేవే లక్ష్యం

మన సంపాదనలో కొంతైనా పేదల సేవకు ఉపయోగించినప్పుడే జీవితానికి సార్థకత. ఆదేవ దేవుడే నన్ను ఆ దిశగా నడిపిస్తున్నాడనేది నా నమ్మకం..ప్రగాఢ విశ్వాసం. – **కొండూరు శరత్‌కుమార్‌రాజు**























